## తెలంగాణ రైజింగ్-2047

# అదే మా నినాదం



- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- జిల్లాలో 7626 స్వయం సహాయక సంఘాలకు రూ. 785.66 కోట్ల రుణాలు
- మహాలక్ష్మితో మహిళలకు రూ. 158.58 కోట్ల లబ్ది
- 77,726 మంది రైతులకు రూ. 605.71 కోట్ల రుణమాఫీ
- తొలి విడతలో 11,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు





**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌తో, అదే నినాదంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సోమవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలుగా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను రూపొందించామని అన్నారు. ఈ లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను చేపట్టిందన్నారు.

**మహిళలకు ఆర్థిక చేయూత**

జిల్లాలోని 7,626 స్వయం సహాయక సంఘాలకు 785.66 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశామన్నారు. 7,999 మంది మహిళలకు 66.18 కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను ఇచ్చామన్నారు. మహిళల ఉపాధి కల్పనకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఈ యాసంగిలో స్వయం సహాయక సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 156 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామన్నారు. మహాలక్ష్మి పథకంతో జిల్లా మహిళలకు 158.58 కోట్ల లబ్ది చేకూరిందన్నారు. జిల్లాలో సబ్సిడీ సిలిండర్లకు 16.44 కోట్ల రూపాయలను ప్రభుత్వం భరించిందని చెప్పారు.

**యువతకు ఉద్యోగావకాశలు**

జిల్లాలో డీఎస్సీ ద్వారా 221 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారని, అలాగే వివిధ రకాల పోటీ పరీక్షల్లో జిల్లాకు చెందిన చాలామంది అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. అన్ని సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో జిల్లాలోని మానకొండూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జిల్లాలో 273 మంది యువతను లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. జిల్లాలో రుణమాఫీ పథకం కింద 77,726 మంది రైతులకు 605.71 కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేశామన్నారు.

**రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు**

రైతు భరోసా పథకం ద్వారా యాసంగి సీజన్‌లో 1,65,850 మంది రైతులకు 132.13 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. వానాకాలం సీజన్ కోసం 30,403 మెట్రిక్ టన్నుల ఎరువులు, సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో భూ భారతిని పకడ్బందీగా అమలు చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 328 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3,08,683 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ధాన్యం విక్రయించిన 51,965 మంది రైతులకు రూ. 716.12 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో 65,949 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు కోసం 46,423 దరఖాస్తులు రాగా ఆయా కార్డులలో 59,034 సభ్యులను నమోదు చేసి బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 77,083 మంది దరఖాస్తు చేసుకున్నారని, మొదటి దశలో 11,575 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు.

**పేదల చికిత్సకు రాజీవ్ ఆరోగ్య శ్రీ**

రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 7,843 మందికి 22.33 కోట్ల విలువ చేసే శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయించామన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే 1,64,519 మంది వినియోగదారులకు 74.34 కోట్ల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం, సూచనలు అందిస్తున్న అందరికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభంప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

**రైతలకు విత్తనాల పంపిణీ**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రూపొందించిన విత్తనాలను మంత్రి శ్రీధర్ బాబు ఆదర్శ రైతులకు అందజేశారు. నాణ్యమైన విత్తన పంపిణి కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, బొమ్మకల్, ఆరపల్లి, వల్లంపహాడ్, నగునూర్ గ్రామాలకు చెందిన ఆదర్శ రైతులను ఎంపిక చేసి ఒక్కో రైతుకు 10 కిలోల వరి, పెసర విత్తనాలను మంత్రి అందజేశారు.

**అమరులకు ఘన నివాళి**

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరులను నివాళులర్పించడం వారి త్యాగానికి మనం ఇచ్చే గొప్ప గౌరవం అన్నారు.

**అమరుల కుటుంబసభ్యులకు సన్మానం**

తెలంగాణ అమర వీరుల కుటుంబాల వారిని మంత్రి శ్రీధర్‌బాబు సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో పెద్ది కనకవ్వ , ఎనుకొండ సుగుణ , తీర్థాలు పరమేశ్వర్ , బూరుగు రాజయ్య , తాటికొండ వినోద , బిచ్చ భారతమ్మ , గవ్వ ప్రమీల, వై సుభాష్, రెడ్డి రాజేశ్వరి , సుదగోని నిర్మల , బొల్లవరం భాస్కర్‌రావు ఉన్నారు.





**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో బాలభవన్ చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.

### ఎంపీ కార్యాలయంలో...

తెలంగాణ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎంపీ కార్యాలయంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జెండాను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల బిఆర్ఎస్, కాంగ్రెస్‌పాలనతో తెలంగాణ దివాళా తీసిందన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసినా రాష్ట్ర ప్రజల బతుకులు మారలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగులు, వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ఆశలను అడియాసలు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి శంకర్‌పాల్గొన్నారు.













# నేడు కరీంనగర్‌లో విత్తన మహోత్సవం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో జూన్ ఈ నెల3న విత్తన మహోత్సవం నిర్వహించనున్నారు. "ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం" అనే కార్యక్రమం కింద అధిక దిగుబడిని అందించే గుణాత్మక విత్తనాలను రైతులకు అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ సందర్భంగా కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం తయారు చేసిన మక్కజొన్న, కంది, పెసర, నువ్వుల విత్తనాలు అందుబాటులో ఉంటాయని శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి తెలిపారు. నాణ్యమైన విత్తనాల వినియోగంతో పంట దిగుబడి పెరగడం ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని, లాభసాటి వ్యవసాయానికి దోహదపడుతుందని ఆమె వివరించారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో నూతన ప్రగతిని సాధించాలని సూచించారు.



## శ్రీభవానీరామలింగేశ్వర స్వామి ఆలయంలో
# వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**శెనార్తి మీడియా, హుజూరాబాద్:**

మండలంలోని వెంకట్రావ్ పల్లె గ్రామంలో శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభ శిఖరయంత్ర విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు నాయకులు స్వామి దర్శించుకొని పూజలు చేశారు.




# సమగ్ర ఆరోగ్య ప్రచారం ప్రారంభం




**శెనార్తి మీడియా, కరీంనగర్:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సమగ్ర ఆరోగ్య ప్రచారం (ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో అధిక ప్రాధాన్యత కలిగిన జిల్లాల్లో జూన్ 1 నుండి సెప్టెంబర్ 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా నాలుగు ప్రత్యేక బృందాలు పని చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రచారంలో హెచ్ఐవి, సిఫిలిస్, క్షయవ్యాధి, షుగర్, అధిక రక్తపోటు, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారు. తిమ్మాపూర్ సబ్ సెంటర్‌లో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (ఎయిడ్స్, కుష్టు) డాక్టర్ సుధ హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ సాజిద్, డిటి పి ఓ డాక్టర్ ఉమాశ్రీ రెడ్డి, పిఓఎంసిహెచ్ డాక్టర్ సనా జవేరియా, డెమో రాజగోపాల్, డిపిఎం స్వామి, సురేందర్, మొబైల్ ఐసిటిసి బృందం, పద్మపాని లింక్ వర్కర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# డివిజన్ల డీలిమిటేషన్‌కు షెడ్యూల్

- ఈ నెల 4న ముసాయిదా
- 21న ఫైనల్ జాబితా
- వివిధ పార్టీల నాయకుల్లో జోరుగా చర్చ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

మున్సిపల్ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనున్న నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో విలీన గ్రామాలకు సంబంధించి డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర సర్కారు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 3న డివిజన్ల విభజనకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. 4న ముసాయిదా జాబితాను పత్రికల్లోనూ ప్రచురించాల్సి ఉంటుంది. 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు, నివేదికలు స్వీకరించాలి. 12 నుంచి 16 వరకు అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంటుంది. 17, 18 తేదీల్లో డివిజన్ల విభజన పత్రాలకు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. 19న ముసాయిదా జాబితాను సీడీఎంఎకు పంపించాలి. 20న సీడీఎంఏ నుంచి ప్రభుత్వానికి నివేదికను పంపించి, 21న ఫైనల్ డివిజన్ల జాబితాను విడుదల చేస్తారు.

**మొదలైన చర్చలు**

కరీం'నగరం' సమీపంలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మల్కాపూర్, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లను 66కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నగరపాలక అధికారులు 66 డివిజన్లకు సంబంధించి గతంలోని ఓటరు జాబితాను అనుసరించి డివిజన్ల విభజనను పూర్తి చేసి సీడీఎంఏకు పంపినట్లు సమాచారం. అందుకు సంబంధించిన ఒక జాబితా కూడా గతంలోనే సోషల్ మీడియాల్లో చక్కర్లు కొట్టింది. అప్పటి నుంచే కార్పొరేషన్‌లోని వివిధ పార్టీల నాయకుల్లో డివిజన్ల విభజనపై ప్రత్యేక ఆసక్తి నెలకొన్నది. ఎవరికివారే తమ డివిజన్ల విభజన ఎలా జరిగింది? ఏయే కాలనీల ఓట్లు ఏయే ప్రాంతాల్లో కలిపారన్న చర్చలు సాగాయి. ప్రతి డివిజన్‌కు 4500 నుంచి 5500 ఓటర్లు ఉండేలా అధికారులు డివిజన్లను విభజించినట్లు తెలుస్తుండగా, అయితే పలు డివిజన్లల్లో దూర ప్రాంతాలకు చెందిన ఇండ్లను చేర్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి ఫిర్యాదులు, తమ అభ్యంతరాలు తెలిపేందుకు ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నాయకులు సిద్ధమయ్యారు.

# కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ



- చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి నియామకం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం చైర్మన్‌గా శంకరపట్నం మండలానికి చెందిన కోరేం రాజిరెడ్డి నియమితులయ్యారు. అలాగే డైరెక్టర్లుగా రామగిరి తిరుమల, ఎడ్ల తిరుపతి, కె. రత్నం, లక్ష్మణ రావు, ఎం. రవీందర్, పి. తిరుపతిని నియమిస్తూ దేవదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బసవయ్య, హుజురాబాద్ మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, దేవస్థాన మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అజయ్, కీసర సంపత్, నేరెళ్ల సంతోష్ తదితరులు హాజరయ్యారు.

# చదువుతోనే బంగారు భవిష్యత్

**శెనార్తి మీడియా, జగిత్యాల :**

చదువుతోనే బంగారు భవిష్యత్తు సాధ్యపడుతుందని జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి రత్న పద్మావతి అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి సోమవారం సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. బాల్యం నుండే రాజ్యాంగ వ్యవస్థల పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే ఆశయంతో పనిచేస్తున్న వాల్మీకి ఆవాస నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ మనుమరాలు యష్ణశ్రీ జన్మదినం సందర్భంగా 65 మంది ఆవాస విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను జిల్లా న్యాయమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆవాస నిర్వాహకులు డాక్టర్ భీమనాతిని శంకర్, నందెల్లి మదన్ మోహన్ రావు, కైలాసం, అశోకరావు, సంపూర్ణ చారి, మధుకర్, నరసింగరావు, సత్యం మల్లేశం తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారి నాయక్, తహసీల్దార్ సురేఖ, వ్యవసాయ అధికారి వెంకటేష్, ఎస్సై రవి జాతీయ పతాకాలను ఎగురవేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి, సిపిఎం పార్టీల కార్యాలయాల్లో పార్టీ మండలాధ్యక్షులు గోపగోని బసవయ్య, గంట మహిపాల్ , ఏనుగుల అనిల్, పిట్టల సమ్మయ్యలు పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఇతర కార్యక్రమాలలో మాజీ జెడ్పీటీసీలు బత్తిని శ్రీనివాస్ గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీ ఓ ప్రభాకర్ పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ విస్తరణపై త్వరలో
# పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**శెనార్తి మీడియా, వేములవాడ:**

వేములవాడ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులపై త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వేములవాడ పట్టణవాసులు, భక్తులందరికీ అవగాహన కల్పించనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, భీమేశ్వరాలయంలో ఏర్పాట్లపై పట్టణ వాసులు, భక్తులు, పండితులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రూ.76 కోట్లతో ఆలయ విస్తరణ పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు. రాజన్న ఆలయాన్ని మూసివేయమని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అసత్య ప్రచారాలు చేయవద్దని కోరారు. స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతాయని తేల్చి చెప్పారు. ఆలయంలో విస్తరణ పనులు చేపట్టనున్న దృష్ట్యా భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. భీమేశ్వరాలయంలో నిత్య కల్యాణం, షెడ్లు, భక్తుల దర్శనం, క్యూలైన్లు, కోడె మొక్కుల క్యూలైన్లు, ఆలయ ఆవరణలో షెడ్లు తదితర మౌలిక వసతులు వంటి పలు అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్టు చెప్పారు. విశాలమైన స్థలం ఆధునిక సౌకర్యాలతో గోశాలను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని.. ఈ మేరకు స్థానికంగా స్థలం గుర్తించాలన్నారు. రాజన్న ఆలయ సమీపంలో కిలోమీటర్ పరిధిలో భారీ భవనాలు నిర్మించవద్దని గతంలో జారీ చేసిన జీవోను కుదించి వంద మీటర్లకు కుదించే విషయంపై చర్చించి.. జీవో సవరణకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థపతి వల్లీ నాయకన్, ఆలయ ఈవో వినోద్ రెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ మధు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈవో అశోక్, అనుబంధ దేవాలయాల పర్యవేక్షకులు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

**భీమేశ్వరాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ కమిషనర్**

రాజన్న ఆలయానికి సంబంధించి తిప్పాపురంలోని గోశాలలోని కోడెల సంరక్షణపై శ్రద్ధ పెట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకటరావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తిప్పాపురంలోని గోశాల ఆవరణలో కోడెలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కోడెలకు పచ్చిగడ్డి ఇవ్వాలని, నాణ్యమైన దాన పెట్టాలని, క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాల్సి నిర్వహించి కావాల్సిన మందులు వేయాలని ఆదేశించారు.

# తిప్పాపూర్ గోశాలలో 20 కోడెలు మృతి

**శెనార్తి మీడియా, వేములవాడ:**

తిప్పాపూర్‌లోని గోశాలలో నారోగ్యంతో ఇప్పటివరకు 20 కోడెలు మృతిచెందాయి. ప్రస్తుతం మరో 16 కోడెలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి వెల్లడించారు. వీటిలో ఆరు కోడెలు పరిస్థితి విషమంగా ఉందన్నారు.అకాల వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా కోడెలు అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. పరిస్థితి దిగజారుతుండటంతో వెంటనే ఐదుగురు వెటర్నరీ డాక్టర్లతో కూడిన వైద్య బృందం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. అయినప్పటికీ, కోడెలు చికిత్సకు స్పందించడం లేదన్నారు. గోశాలలో మొత్తం 1300 పశువులుండగా, మిగిలినవన్నీ ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. పచ్చగడ్డి సరఫరా పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఒక ట్రాక్టర్ బదులు ఐదు ట్రాక్టర్లు గడ్డి వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు.సామాజిక మాధ్యమాల్లో వాస్తవానికి విరుద్ధంగా వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని, పశువుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు.



# నేటి నుంచి సమగ్ర ఆరోగ్య శిబిరాలు

**డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి**

**శెనార్తి మీడియా, పెద్దపల్లి:**

జిల్లా ప్రజల ఆరోగ్య స్థితిని తెలుసుకోనేందుకు జూన్ మూడు నుండి సమగ్ర ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి తెలిపారు. కలెక్టరేట్‌లోని మీని మీటింగ్ హాల్‌లో సమగ్ర ఆరోగ్య శిబిరాల నిర్వాహణపై హెల్త్ అసిస్టెంట్లు, ఐసీటీసీ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందితో సోమవారం సమావేశమై ఆమె మాట్లాడారు. సమగ్ర ఆరోగ్య శిబిరంలో వైద్యాధికారి, ల్యాబ్ టెక్నిషియన్, కౌన్సిలర్ పాల్గొంటారని తెలిపారు. డయాబెటిస్, బీపీ, హిమోగ్లోబిన్, ర్యాండమ్ బ్లడ్ శాంపిల్ పరీక్షలు, క్షయ వ్యాధి నిర్ధారణకు స్ఫూటమ్ పరీక్షలు చేస్తారని చెప్పారు